

మహాశక్తి ఆలయంలో పాల్గొన్న భక్తులు, చిన్నారితో అక్షరాభ్యాసం చేయిస్తున్న మహిళ

అధ్వానంగా సిక్కువాడి రోడ్డు



గంజ్‌హైస్కూల్ పక్క వీధిలో యూజీడీ కోసం రోడ్డును తవ్వి వదిలిపెట్టిన దృశ్యం

- నగర నడిబొడ్డున ప్రజలకు తప్పని ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులు

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 14: నగరానికి నడిబొడ్డులాంటి గంజ్, కూరగాయల మార్కెట్, సిక్కువాడ, పాత బజారు రోడ్లు అధ్వానంగా మారాయి. నగరపాలక సంస్థ కార్యాలయం, కలెక్టర్ నివాసాన్ని ఆనుకొని ఉన్న ఈ ప్రాంతం రాత్రి, పగలు అనే తేడా లేకుండా సందడిగా ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం కరీంనగర్‌ను స్మార్ట్‌సిటీ జాబితాలో చేర్చడంతో నగర రూపురేఖలు పూర్తిగా మారిపోతాయని, టవర్ సర్కిల్‌తోపాటు పరిసరాలు నగరానికే రోల్‌మాడల్‌గా మారుతాయని అంతాభావించారు. అధికారులు, పాలకులు కూడా అదే చెబుతూ ప్రజలకు అరచేతిలో స్వర్గం చూపించారు. టవర్‌సర్కిల్ కేంద్రంగా కరీంనగర్‌ను స్మార్ట్‌సిటీగా మార్చుతామని చెప్పారు. టవర్‌సర్కిల్‌ను ఆనుకొని ఉన్న ప్రకాశంగంజ్, సిక్కువాడ, ప్రధానకూరగాయల మార్కెట్, చేపల మార్కెట్, బోయివాడ ప్రాంతాల్లోని రోడ్లు అధ్వానంగా మారాయి. యూజీడీ కోసం రోడ్లు తవ్వి పైపులైన్లు, ఛాంబర్లు నిర్మించి వాటికి మరమ్మత్తు చేయకుండా వదిలిపెట్టడంతో కొన్ని చోట్ల కనీసం నడిచేందుకు కూడా వీలు లేకుండా ఉన్నాయి. అధ్వానంగా ఉన్న రోడ్లపై వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దుకాణాలకు, గోడౌన్లకు కమర్షియల్ ఆస్తి పన్నులు, ఇంటి పన్నులను, నల్లా బిల్లులను వసూలు చేస్తున్న నగరపాలక సంస్థ కనీస మౌళిక సదుపాయాలను



అధ్వానంగా ఉన్న రోడ్డు

కల్పించడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పన్నులు చెల్లించకుంటే ముక్కుపిండి జరిమానా వసూలు చేస్తున్నారని, కొన్ని సందర్భాల్లో ఆస్తులను కూడా జప్తు చేస్తున్నారని, మౌళిక సదుపాయాలను ఎందుకు కల్పించడం లేదని వారు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా నగరపాలక సంస్థ పాలకవర్గం, అధికారులు స్పందించి రోడ్లను అభివృద్ధి చేయాలని నగరవాసులు కోరుతున్నారు.

సరస్వతీ నమస్తుభ్యం..

- భక్తిశ్రద్ధలతో వసంతపంచమి పూజలు

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 14: మాఘ శుద్ధ పంచమి సందర్భంగా నగరంలోని పలు ఆలయాల్లో బుధవారం వసంతపంచమి పూజలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారికి అభిషేక అర్చనలు, అలంకారాలు, హవనాలు, సామూహిక అక్షరాభ్యాసాలు, పుస్తక పూజలు, ఒడిబియ్యం సమర్పణలతో ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంది. పలు విద్యాసంస్థల్లో అమ్మవారి పూజలు, హోమాలతో పాటు అక్షరాభ్యాసాలు, నూతన అడ్మిషన్లను ప్రారంభించారు.

- మహాశక్తి ఆలయానికి భక్తజనం...

చైతన్యపురి మహాశక్తి ఆలయం విద్యార్థులు, భక్తజనంతో పోటెత్తింది. అమ్మవార్లకు అభిషేక అర్చనలు, సామూహిక కుంకుమార్చన, పుస్తక పూజ, సామూహిక అక్షర స్వీకారాలు జరిగాయి. చిన్నారులు, భక్తులు అమ్మవార్లను పెద్ద సంఖ్యలో దర్శించుకొని తరించారు. యజ్ఞవరాహ క్షేత్రంలో వసుధాలక్ష్మి, వరదుర్గ, వాగ్వాదిని మహాసరస్వతి అమ్మవార్లకు అభిషేకం, సారెల సమర్పణ, కుంకుమార్చన, సామూహిక అక్షరాభ్యాసాలు జరిగాయి. గాయత్రీనగర్ గణేశశారదాశంకరాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, చిన్నారులకు అక్షరాభ్యాసాలు జరిపారు.

ఉగ్రదాడిలో అమరులైన జవాన్లకు నివాళులు



అమరులైన వీరజవాన్లకు నివాళులర్పిస్తున్న విశ్వ హిందూ పరిషత్, బజరంగ్‌దళ్ నాయకులు

గణేశ్‌నగర్, ఫిబ్రవరి 14: ఉగ్రవాదుల దాడిలో పుల్వామాలో అమరులైన 40 మంది వీర జవాన్లకు కరీంనగర్ తెలంగాణ చౌక్‌లో విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో బుధవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2019 ఫిబ్రవరి14 నాడు జరిగిన ఉగ్రదాడిలో 40 మంది జవాన్లు వీర మరణం పొందారన్నారు. దేశయువత వాలెంటైన్స్ డేను బహిష్కరించి, పుల్వామా అమర వీరులను స్మరించుకోవాలన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి విద్యాసాగర్, జిల్లా సహ కార్యదర్శి శ్రీనివాససుదర్శన్, తోట రాజేందర్, బజరంగ్ దళ్ జిల్లా కో కన్వీనర్ కన్నం శంకర్, నగర కన్వీనర్ రాజేందర్ పాల్గొన్నారు.

వైభవంగా అధ్యయనోత్సవం...

పరమపదోత్సవం

- ఆలయంలో భక్తుల సందడి

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 14: జిల్లా కేంద్రంలోని మార్కెట్‌రోడ్ వేంకటేశ్వరస్వామి ఆలయం బ్రహ్మోత్సవ శోభను సంతరించుకుంది. బుధవారం ఉదయం అధ్యయనోత్సవం, సాయంత్రం పరమపదోత్సవం వైభవంగా జరిగింది. ఉత్సవ మూర్తుల ముందు ద్రవిడ వేద పారాయణం మధ్య తొళ్లక్కము, ప్రబంధ పారాయణం చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తుల రద్దీ పెరిగింది. శ్రీవారిని భక్తులు దర్శించి పులకించిపోయారు. పారాయణాలు, భజనలు, కీర్తనలతో ఆలయం మారుమోగింది. కార్యక్రమంలో అర్చకులు లక్ష్మీనారాయణాచార్యులు, నాగరాజాచార్యులు, వంశపారంపర్య ధర్మకర్తలు చకిలం శ్రీనివాస్, చకిలం గంగాధర్, ఈవో వుడుతల వెంకన్న పాల్గొన్నారు.

- అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు..

గాయకుడు, ఉత్సవాల కల్చరల్ ఆర్గనైజర్ సల్వాజి ప్రవీణ్ నేతృత్వంలో ఉదయం హనుమాన్ సేవాసమితి బోగ శ్రీనివాస్ బృందం, సత్యసాయి సేవాసమితి, శ్రీరామదూత భజన మండళ్ల ఆధ్వర్యంలో భజనలు నిర్వహించారు. సాయంత్రం కట్ట వాణి శిష్య బృందం భక్తి కీర్తనలు, జమున, లలిత, కాళిదాసు భక్తి కీర్తనలు, ఉషాబాద్రి భరతనాట్య మండలి భరతనాట్యం, రంగాచార్యుల బృందం, సిద్ది ఇషా, స్వప్నకుమారి కళాక్షేత్ర మండలి కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఎంతగానో అలరించాయి..



చిన్నారులను అభినందిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

- నేటి కార్యక్రమాలు..

గురువారం ఉదయం 9 గంటల నుంచి అంకురార్పణలో భాగంగా పాతబజార్ గౌరీశంకరాలయం నుంచి పుట్టమన్ను తేస్తారు. మధ్యాహ్నం సహస్ర కలశాభిషేకం, సాయంత్రం పుణ్యాహవాచనం, రక్షాబంధనం, ధ్వజాధివాసం, రాత్రి 6.30 నుంచి శేషవాహనసేవ నిర్వహిస్తారు.

- పాల్గొన్న కలెక్టర్

మార్కెట్‌రోడ్ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం అధ్యయనోత్సవ ముగింపులో నమ్మాళ్వార్ పరమపదోత్సవానికి కలెక్టర్ పమేలా సత్పతి హాజరై పూజలు నిర్వహించారు. అంతకు ముందు ఆమె శ్రీవారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న చిన్నారులను అభినందించి జ్ఞాపికలు అందజేశారు. ఉత్సవంలో కలెక్టర్‌తో పాటు కాంగ్రెస్ నగర అధ్యక్షుడు



హారతి ఇస్తున్న అర్చకుడు

కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, పీసీసీ రాష్ట్ర కార్యదర్శి వైద్యుల అంజన్‌కుమార్, అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్, మాజీ మేయర్ రవీందర్‌సింగ్, మాజీ కార్పొరేటర్లు వైద్యుల శ్రీదేవి అంజన్‌కుమార్, పడిశెట్టి భూమయ్య, నాయకులు కన్న కృష్ణ, ముక్క భాస్కర్ పాల్గొన్నారు.



ఉత్సవానికి హాజరైన భక్తులు, నాయకులు

పీఎంఎఫ్‌ఎంఈలో జిల్లాకు ప్రథమ స్థానం

- ఆర్థిక మద్దతు పథకాల లక్ష్యసాధనకు బ్యాంకర్లు సహకరించాలి
- కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): రాష్ట్రంలో ప్రధాన మంత్రి ఫార్మలైజేషన్ మైక్రోఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ (పీఎంఎఫ్ఎంఈ)లో, బ్యాంకు లింకేజీలో జిల్లా ప్రథమస్థానంలో నిలిచిందని కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు, బ్యాంకర్లను ఆమె అభినందించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

బుధవారం కలెక్టరేట్ సమావేశమందిరంలో బ్యాంకర్లు, జిల్లా అధికారులతో రైతులకు రుణాల పంపిణీ, స్వయం సహాయక సంఘాల రుణాలు తదితర అంశాలపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2023-24 ఆర్థిక సంవత్సరంలో 9,924 స్వయం సహాయ బృందాలకు బ్యాంకు లింకేజీ బ్యాంకు లింకేజీ అందించామన్నారు. ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ మైక్రోఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ పథకం కింద 190 యూనిట్లను గ్రౌండింగ్ చేశామని, లబ్ధిదారులకు వివిధ కార్యకలాపాల కింద బేకరీ, స్పైసెస్, ఫ్లోర్ మిల్, రోస్టర్ మెషిన్, దాల్‌మిల్, బియ్యం ఆధారిత ఉత్పత్తుల తదితర యూనిట్లను గ్రౌండింగ్ చేశామని తెలిపారు. జిల్లాలో వివిధ ఆర్థిక మద్దతు పథకాల లక్ష్యసాధనకు రుణాలు అందించడంలో బ్యాంకర్లు పూర్తిస్థాయిలో సహకరించాలని కలెక్టర్ బ్యాంకర్లకు సూచించారు. వివిధ ఆర్థిక మద్దతు పథకాలకు సంబంధించి వంద శాతం లక్ష్యసాధనకు బ్యాంకర్లు, ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. రైతులు తమ రుణాలను రెన్యూవల్ చేసుకునే అంశంపై వారికి అవగాహన కల్పించాలని, జిల్లాలో వ్యవసాయశాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ బ్యాంకర్లు ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఉన్న లక్ష్యాల్లో 106.66 శాతం పూర్తయిందని, పెండింగ్‌లో ఉన్న రుణాల ప్రతిపాదనలు సైతం బ్యాంకర్లకు అందించి త్వరగా మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వివిధ పథకాల్లో రుణాలు మంజూరయిన లబ్ధిదారులు, స్వయం సహాయక సంఘాలు తిరిగి సకాలంలో బ్యాంకులకు చెల్లించేలా ఆయాశాఖల అధికారులు జిల్లాలో రుణాల రికవరీపై శ్రద్ధ వహించాలని ఆదేశించారు. యువతకు ఉపాధి అందించే విషయంలో అధికారులు చొరవ చూపాలని బ్యాంకర్లకు సూచించారు. జిల్లాలో ప్రధానమంత్రి స్వానిధి కింద రుణం కోసం దరఖాస్తు చేసుకున్న వారి పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలని సూచించారు. ఆర్థిక అక్షరాస్యతవారం 2024లో భాగంగా జిల్లా విద్యాశాఖ అధికారి, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి సహాయంతో అన్ని పాఠశాలలు, కళాశాలలు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో సైబర్ క్రైమ్‌పై ప్రజలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. జిల్లాలోని ప్రతి సినిమా థియేటర్లలో లఘు చిత్రాలు ప్రదర్శింపజేయాలని, సైబర్ క్రైం బాధితుల వివరాలు, ఫొటోలను వెల్లడించకుండా వారు ఏ విధంగా నష్టపోయారో తెలిసేలా ప్రచార కార్యక్రమాలను రూపొందించాలన్నారు.కార్యక్రమంలో ఎల్‌డీఎం అంజనేయులు, ఆర్‌బీఐ అధికారి సాయితేజ, ఏజీఎం నాబార్డు ప్రకాశ్, ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ రాంచంద్రుడు, యూబీఐ చీఫ్ మేనేజర్ కలీం, టీజీబీ ఏజీఎం ప్రభుదాస్, కేడీసీసీబీ సీఈవో సత్యనారాయణ, బ్యాంకు కంట్రోలర్స్, లోకల్ బ్యాంకుల మేనేజర్లు, డీఆర్డీవో శ్రీధర్, డీఏవో ప్రియదర్శిని, జిల్లా పరిశ్రమల కేంద్ర జీఎం నవీన్, డీడ బ్ల్యూవో సరస్వతి, ఉద్యానవనశాఖ జేడీ శ్రీనివాస్, చేనేత శాఖ ఏడి చరణ్, అడిషనల్ ఆర్డీవో సునిత,డీపీఎం రవీందర్ పాల్గొన్నారు.

- సీఎస్‌సీ ఐసీటీ కేంద్రాలతో డిజిటల్ సేవలు

కరీంనగర్ టౌన్: జిల్లాలో ఏర్పాటు చేయనున్న మోడల్ సీఎస్‌సీ ఐసీటీ కేంద్రాలతో గ్రామీణ ప్రాంత ప్రజలకు డిజిటల్ సేవలు మరింత అందుబాటులోకి వస్తాయని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. ఈ కేంద్రాల ద్వారా 100 మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. బుధవారం కలెక్టరేట్ ఛాంబర్‌లో జిల్లా బ్యాంకర్ల సమావేశాన్ని ఏర్పాటు చేసి మోడల్ సీఎస్‌సీ ఐసీటీ కేంద్రాలకుసంబంధించిన ప్రాజెక్టు బ్రోచర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో ప్రాజెక్టు మేనేజర్ బేతోజు హరికృష్ణకుమార్, ఈడీఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 14: రానున్న కరీంనగర్ లోక్‌సభ ఎన్నికలు, కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించిన ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎస్సారార్ కళాశాలలో లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్ కోసం చేస్తున్న ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని కరీంనగర్, మానకొండూర్, హుజూరాబాద్, వేములవాడ, రాజన్న సిరిసిల్ల, చొప్పదండి, హుస్నాబాద్ నియోజకవర్గాలకు సంబంధించిన ఎన్నికల కౌంటింగ్‌ను ఎస్సారార్ కళాశాలలో నిర్వహిస్తారన్నారు. అందుకోసం అవసరమైన అన్ని ఏర్పాట్లను చేయాలని సూచించారు. ఎంట్రీ, ఎగ్జిట్‌లు ఉండాలని, పార్టీ ప్రతినిధులకు సిబ్బందికి వేర్వేరుగా కౌంటింగ్ కేంద్రంలోకి ప్రవేశించే విధంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీపీ అభిషేక్ మొహంతి, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, టౌన్ ఏసీపీ నరేందర్, ఏడు నియోజకవర్గాల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు మహేశ్వర్, రాజు, మధుసూదన్‌రావు, ఆనంద్‌కుమార్, ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

- మొదటి స్థాయి ఎఫ్ఎల్‌సీ పూర్తి


పార్లమెంట్ ఎన్నికల కోసం ఫస్ట్ లెవల్ (మొదటిస్థాయి) ఎఫ్ఎల్‌సిని పూర్తి చేశామని కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోడౌన్‌లో నిర్వహించిన మాక్ పోల్‌ను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి సదానందం పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా రైతు మృతి

గన్నేరువరం, ఫిబ్రవరి 14, మండలంలోని గుండ్లపల్లి గ్రామానికి చెందిన రైతు పంబాల కొమురయ్య(55) తన వ్యవసాయ క్షేత్రంలో బుధవారం మృతి చెందాడు. మృతుడి ముఖంపైన చేతులపైన కాలిన గాయాలు ఉండడంతో విద్యుదాఘాతంతో మృతి చెంది ఉంటాడని గ్రామస్థులు అనుకున్నప్పటికీ పడిపోయిన స్థలంలో ఎలాంటి విద్యుత్ తీగలు లేకపోవడంతో రైతు మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మృతుడికి భార్య, ఒక కొడుకు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించేందుకు కరీంనగర్‌కు తరలించారు. పోలీసులు దీనిపై లోతుగా దర్యాప్తు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. తండ్రి మృతిపై అనుమానాలున్నాయని కొమురయ్య కొడుకు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పంపకాలకు వేళాయే!

- ఢిల్లీలోని ఉమ్మడి ఆస్తుల విభజనకు ముందడుగు
- 19.781 ఎకరాలలో.. ఏపీకి 11.356, తెలంగాణకు 8.245 ఎకరాలు
- తెలంగాణ ప్రతిపాదనకు ఏపీ ఓకే



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీలో రెండు తెలుగు రాష్ట్రాలకు ఉమ్మడిగా ఉన్న ఆస్తుల విభజనలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఉమ్మడి(ఆంధ్రప్రదేశ్, తెలంగాణ)భవన్ విభజనకు మార్గం సుగమమైంది. మొత్తం 19.781 ఎకరాలలో ఉన్న ఉమ్మడి భవన్ ఆస్తులలో ఏపీకి 11,356 ఎకరాలు, తెలంగాణకు 8.245 ఎకరాలు కేటాయించాలని తెలంగాణ ప్రభుత్వం చేసిన ప్రతిపాదనకు ఏపీ సర్కారు సుముఖత వ్యక్తం చేసింది. ఈ మేరకు ఏపీ ప్రభుత్వ స్పందనను కేంద్ర హోంశాఖ బుధవారం తెలంగాణ ప్రభుత్వానికి తెలియజేసింది. తెలంగాణ సీఎం ఎ.రేవంత్ రెడ్డి, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చొరవతో గత నెలలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ భవన్ అధికారులతో కేంద్ర హోంశాఖ కీలక సమావేశం నిర్వహించింది. అనంతరం ఉమ్మడి ఆస్తుల విభజనపై తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదనలు పంపింది. ఏపీ భవన్ కింద ఉన్న గోదావరి బ్లాక్ 4.315 ఎకరాలు, శబరి బ్లాక్‌తో పాటు అంతర్గత రహదారులు, దుకాణాలు(ఆక్రమణకు గురైన ప్రాంతం) ఉన్న 0.512 ఎకరాలు, నర్సింగ్ హాస్టల్ 3.359 ఎకరాలు, పటౌడీ హౌస్‌లో 2.396 ఎకరాలు ఏపీకి ఇచ్చేలా ప్రతిపాదన చేశారు. అదే విధంగా శబరి బ్లాక్ కింద ఉన్న 3 ఎకరాలు, పటౌడీ హౌస్‌లో ఉన్న 5.245 ఎకరాలు తమకు కేటాయించేలా తెలంగాణ ప్రతిపాదన చేసింది. అయితే తమకు ప్రతిపాదించిన అంతర్గత రహదారులు, దుకాణాలు(ఆక్రమణలు) ఉన్న ప్రాంతం(0.512 ఎకరాలు) విలువ దాదాపు రూ.250 కోట్లు అని, ఆ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకోలేకపోతే అందుకు సరిసమానమైన భూమిని శబరి బ్లాక్ లేదా పటౌడీ హౌస్‌లోని భూమి నుంచి కేటాయించాలని ఏపీ షరతు విధించింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వ వివరణ కోరుతూ కేంద్ర హోంశాఖ బుధవారం తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాసింది.

58:42 నిష్పత్తిలో పంపకాలు..

ఢిల్లీలోని ఉమ్మడి ఏపీ భవన్‌కు భూములు, భవనాలు సహా దాదాపు రూ.9,913.505 కోట్ల(దాదాపు పది వేల కోట్లు) విలువైన ఆస్తులు ఉన్నాయి. గోదావరి బ్లాక్, శబరి బ్లాక్, నర్సింగ్ హాస్టల్, పటౌడీ హౌస్ అనే విభాగాల కింద ఉమ్మడి భవన్ ఆస్తులు ఉన్నాయి. ఉమ్మడి రాష్ట్రానికి బయట ఉన్న ఆస్తులను రెండు తెలుగు రాష్ట్రాలు 58:42 నిష్పత్తిలో పంచుకోవాలని రాష్ట్ర పునర్విభజన చట్టంలో పొందుపరిచారు. కాగా, భవన్ పంపకాలలో ఏపీకి 58.32శాతం, తెలంగాణకు 41.68 శాతం ఆస్తులు రానున్నాయి. తెలంగాణ ప్రభుత్వం పటౌడీ హౌస్‌లోని 5.245 ఎకరాల్లో నూతన తెలంగాణ భవన్ నిర్మించేందుకు సిద్ధమవుతోంది.



తమ సోదరుడి పాడె మోస్తున్న మల్లు భట్టి విక్రమార్క, రవి

సోదరుడికి కన్నీటి వీడ్కోలు పలికిన భట్టి

- పాడె మోసి నివాళులు

వైరా, ఫిబ్రవరి 14: అనారోగ్యంతో మృతిచెందిన విశ్రాంత ఆయుష్ అదనపు డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ మల్లు వెంకటేశ్వర్లు అంత్యక్రియలు బుధవారం ఆయన స్వగ్రామంలో అశ్రునయనాల మధ్య ముగిశాయి. డాక్టర్ వెంకటేశ్వర్లు సోదరులైన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి డాక్టర్ మల్లు రవి ఆయన పాడె మోసి నివాళులర్పించారు. అంత్యక్రియలకు ముందు డాక్టర్ మల్లు వెంకటేశ్వర్లు భౌతికకాయాన్ని పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు సందర్శించి నివాళులర్పించారు. అనంతరం అంతిమయాత్రతో ఆయన స్వగ్రామమైన స్నానాల లక్ష్మీపురానికి తీసుకువచ్చారు. గంటసేపు గ్రామస్థుల సందర్శనార్థం అక్కడ ఉంచారు. ఆ తర్వాత ఆయన వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలు నిర్వహించారు.

రాష్ట్రంలో భారీగా అధికారుల బదిలీలు

- మునిసిపల్ కమిషనర్లు, వ్యవసాయశాఖలో అసిస్టెంట్ డైరెక్టర్లతో పాటు 95 మంది డీఎస్పీలకు స్థానచలనాలు
- జీహెచ్ఎంసీలో కమిషనర్ల బదిలీలు చర్చనీయాంశం

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో.. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా అధికారుల బదిలీలు చేపట్టింది. ఈ మేరకు సంబంధిత శాఖలు బుధవారం ఉత్తర్వులు జారీ చేశాయి. రాష్ట్రవ్యాప్తంగా మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో విధులు నిర్వహిస్తున్న 114 మంది కమిషనర్లను బదిలీ చేస్తూ రాష్ట్ర మునిసిపల్‌శాఖ ఉత్తర్వులిచ్చింది. మంగళవారం 40 మంది కమిషనర్లను బదిలీ చేయగా బుధవారం మరో 74 మంది కమిషనర్లను బదిలీ చేస్తూ ఉత్తర్వులిచ్చింది. ప్రధానంగా జీహెచ్ఎంసీ పరిధిలో దీర్ఘకాలంగా పనిచేస్తున్న మునిసిపల్ కమిషనర్ల బదిలీ చర్చనీయాంశమైంది. గత ప్రభుత్వ పెద్దల అండదండలతో ఏళ్లుగా జీహెచ్ఎంసీ పరిధిలో తిష్ఠవేసిన పలువురు కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లకు స్థానచలనం కల్పించారు. అలాగే రాష్ట్ర వ్యవసాయశాఖలో పనిచేస్తున్న తొమ్మిది మంది అసిస్టెంట్ డైరెక్టర్లను బదిలీ చేస్తూ రాష్ట్ర వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు ఉత్తర్వులు జారీచేశారు. మహబూబాబాద్ డీఏవోగా అభిమన్యు, భద్రాద్రి కొత్తగూడెం డీఏవోగా బి.బాబూరావు, సూర్యాపేట డీఏవోగా శ్రీధర్‌రెడ్డిని నియమించారు. పలు డివిజన్లకు ఏడీఏలను కూడా మార్చారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా సివిల్, తదితర విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న 95 మంది డీఎస్పీలను బదిలీ చేస్తూ డీజీపీ రవిగుప్తా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం 110 మంది డీఎస్పీలు బదిలీ కాగా రెండో జాబితాలో మరో 95 మందిని బదిలీ చేశారు.

బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా రేపు సార్వత్రిక సమ్మె

బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలపై ఫిబ్రవరి 16న నిర్వహించనున్న కార్మిక సమ్మె, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఉద్యోగ, కార్మిక, రైతాంగ ప్రజావ్యతిరేక విధానాలను, కార్పొరేట్, మతోన్మాద రాజకీయాలను వ్యతిరేకిస్తూ కేంద్ర ట్రేడ్ యూనియన్ సంఘాలు, రైతుసంఘాల ఐక్యవేదిక సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) దేశవ్యాప్తంగా ఆందోళనలకు పిలుపునిచ్చాయని పేర్కొన్నాయి. ఈ మేరకు వామపక్ష పార్టీల తరఫున సీపీఐ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సీపీఐఎంఎల్(ప్రజాపంథా) పోటు రంగారావు, సీపీఐఎంఎల్ (న్యూడెమోక్రసీ) చలపతిరావు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.



ప్రజాహిత యాత్రలో బండి సంజయ్

'కాళేశ్వరం' బాధ్యులను ఎందుకు అరెస్టు చెయ్యలే?

- ఎంపీ బండి సంజయ్

సిరిసిల్ల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర డ్యామ్ సేఫ్టీ అథారిటీ బృందం కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను సందర్శించి నివేదిక రూపొందించి చర్యలు తీసుకోవాలని కోరినా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ ఆరోపించారు. కాళేశ్వరం బాధ్యులను ఎందుకు అరెస్ట్ చేయడం లేదని ప్రశ్నించారు. అంతేకాక, ఎన్నికల టికెట్ కోసం కన్నకొడుకు పేరునే మార్చేసిన ఘనుడు కేసీఆర్ అని విమర్శించారు. కేటీఆర్ అసలు పేరు కల్వకుంట్ల అజయ్‌రావు అని వెల్లడించారు. సిరిసిల్ల నియోజకవర్గంలోని గంభీరావుపేట, ముస్తాబాద్, తంగళ్లపల్లి మండలాల్లో బండి సంజయ్ బుధవారం ప్రజాహిత యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ తనకు టికెట్ ఇవ్వడం లేదని తెలుసుకున్న కేసీఆర్.. అజయ్‌రావును తీసుకెళ్లి మీ పేరే పెట్టుకున్నానని ఆయనకు చెప్పి టికెట్ తెచ్చుకున్న మోసగాడు కేసీఆర్ అని విమర్శించారు. అబద్ధాలు, మోసాల్లో కేటీఆర్ అయ్యను మించిపోయాడని ఎద్దేవా చేశారు. అయ్య(కేసీఆర్) ఏక్ నంబర్ అయితే కొడుకు(కేటీఆర్) దస్ నంబరని అన్నారు. తెలంగాణకు కేంద్రం పెద్ద ఎత్తున నిధులు ఇస్తోందని, రాజన్న సిరిసిల్ల జిల్లాకు రూ. 1,408 కోట్లు నిధులు ఇచ్చిందని తెలిపారు. కమలం పువ్వు గుర్తుకు ఓటు వేస్తే రాముడికి ఓటు వేసినట్లేనని తెలిపారు. తెలంగాణ ప్రజల పక్షాన బీజేపీ కొట్లాడితే కాంగ్రెస్‌కు అధికారం ఇవ్వడం న్యాయమా? అని అడిగారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేసే పరిస్థితి లేదని, ఎన్నికల కోడ్ నెపంతో ఆ పార్టీ నేతలు తప్పించుకునే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు.

రాష్ట్రంలో 2 లక్షల మందికి 'ముఫ్త్ బిజిలీ'!

(మొదటి పేజీ తరువాయి)

తొలిదశలో భాగంగా 34,59,585 మందికి ఉచితంగా విద్యుత్‌ను అందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సూత్రప్రాయంగా నిర్ణయించింది. ఇదే సమయంలో ప్రధాని మోదీ ప్రకటించిన ముఫ్త్ బిజిలీ యోజన రాష్ట్రంలో సంపూర్ణంగా అమలయితే దాదాపు 2 లక్షల మందికి లబ్ధి చేకూరవచ్చని సంబంధిత అధికారవర్గాలు తెలిపాయి. ఈ మేరకు రాష్ట్రప్రభుత్వంపై గృహజ్యోతి భారం స్వల్పంగా తగ్గే అవకాశం ఉంది. మరోవైపు, ప్రతీ నెల 150 యూనిట్ల దాకా విద్యుత్ వినియోగించేవారికి 1-2 కిలోవాట్ల రూఫ్‌టాప్ సోలార్ యూనిట్ ఏర్పాటు చేసుకోవటానికి అవకాశం ఉంది. దీనికి రూ.1.10 లక్షలు వ్యయం కానుండగా... రూ.60 వేలు సబ్సిడీ లభిస్తుంది. మిగిలిన రూ.50 వేలు సొంతంగా పెట్టుకోవాలి. 150 యూనిట్ల విద్యుత్ వాడకానికి నెలకు రూ.700 దాకా బిల్లు వచ్చే అవకాశం ఉండగా... సోలార్ యూనిట్‌తో రూ.625 మేర ఆదా అవుతుందని, బిల్లు కేవలం రూ.75 మాత్రమే చెల్లించే పరిస్థితి ఉంటుందని తెలుస్తోంది. కేంద్ర పథకం కింద రూఫ్‌టాప్ (ఇంటి పైకప్పు మీద) సోలార్ యూనిట్లు పెట్టుకుంటే... వేసవిలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల దాకా విద్యుత్తు ఉత్పత్తి అయ్యే అవకాశం ఉంటుంది. ఈ విద్యుత్‌ను సొంతంగా వాడుకోవచ్చు లేదా డిస్కమ్‌లకు విక్రయించుకోవచ్చు. చీకటిపడ్డాక సౌరవిద్యుత్ ఉత్పత్తి ఆగిపోతుంది కాబట్టి ఆ సమయంలో బ్యాటరీలో నిల్వ చేసిన కరెంట్‌ను లేదా డిస్కమ్‌లు సరఫరా చేసే కరెంట్‌ను వాడుకోవాల్సి ఉంటుంది. కాగా, వినియోగదారుల నుంచి కొనుగోలు చేసే విద్యుత్ ధరను కేంద్రం ఖరారు చేయనుంది.

యూనిట్ల వినియోగం	సోలార్ ప్లాంట్	వ్యయం	కేంద్రం సబ్సిడీ	వినియోగదారుడు భరించాల్సింది
0-100	1 కిలోవాట్	రూ.60 వేలు	రూ.30 వేలు	రూ.30 వేలు
150	2 కిలోవాట్లు	రూ.1.10 లక్షలు	రూ.60 వేలు	రూ.50 వేలు
300	3 కిలోవాట్	రూ.1.65 లక్షలు	రూ.78 వేలు	రూ. 87 వేలు

ముఫ్త్ బిజ్లీ యోజన

ముఫ్త్ బిజ్లీ యోజనలో ఒక కిలోవాట్ సోలార్ ప్లాంట్‌కు రూ.30 వేలు, రెండు కిలోవాట్లకు రూ.60 వేలు, మూడు లేదా అంతకన్నా ఎక్కువ కిలోవాట్ సోలార్ ప్లాంట్లకు రూ.78 వేలు సబ్సిడీ లభిస్తుంది.

భారీగా పెరిగిన సబ్సిడీ

సోలార్ రూఫ్‌టాప్ పథకం ప్రారంభించిన కొత్తలో కేంద్రం 3 కిలోవాట్లదాకా 40 శాతం సబ్సిడీ ఇస్తుండేది. అయితే, క్రమేణా దీనిని తగ్గించుకుంటూ వచ్చారు. ప్రస్తుతం ప్రతి కిలోవాట్‌కు రూ.18 వేల చొప్పున 3 కిలోవాట్లకు రూ.54 వేలు సబ్సిడీ ఇస్తున్నారు. 3 కిలోవాట్ల నుంచి 10 కిలోవాట్ల దాకా కిలోవాట్‌కు రూ.9 వేల చొప్పున సబ్సిడీ ఇస్తున్నారు. ఇక అపార్టుమెంట్లు వంటి గ్రూప్ హౌసింగ్‌కు కిలోవాట్‌కు రూ.9 వేల దాకా సబ్సిడీ లభిస్తోంది. అయితే, ప్రస్తుతం ప్రకటించిన ముఫ్త్ బిజిలీ యోజనలో సబ్సిడీని భారీగా పెంచారు. ఈ పథకం కింద సోలార్ ప్లాంట్ ఏర్పాటు కోసం http://pmsuryaghar.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ప్రభుత్వ ఆమోదం లభించిన తర్వాత ఇంటి పైకప్పు మీద సోలార్ యూనిట్ పెట్టుకోవచ్చు. దక్షిణ డిస్కమ్ (ఎస్పీడీసీఎల్-హైదరాబాద్) పరిధిలో 80 మంది, ఉత్తర డిస్కమ్ (ఎన్పీడీసీఎల్-వరంగల్) పరిధిలో 82 మంది సోలార్‌ప్లాంట్ విక్రేతలు ఉన్నారు.

బీఆర్ఎస్‌కు షాక్

కాంగ్రెస్‌లో చేరిన 36 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు

కొత్తగూడెం టౌన్/వైరా/సూర్యాపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్‌కు భారీ షాక్ తగిలింది. కొత్తగూడెం, సూర్యాపేట మునిసిపాలిటీకి చెందిన కౌన్సిలర్లు పార్టీ ఫిరాయించారు. కొత్తగూడెం మునిసిపాలిటీలో బీఆర్ఎస్‌కు చెందిన ఓ కౌన్సిలర్‌తో పాటు పలువురు మహిళా కౌన్సిలర్ల భర్తలు, బంధువులు సుమారు 20 మంది కాంగ్రెస్‌లో చేరారు. వీరంతా బుధవారం ఖమ్మం జిల్లా వైరాలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన నాయకులకు ఏఐసీసీ పరిశీలకుడు రోహిత్‌చౌదరి కాంగ్రెస్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ నెల 19న కొత్తగూడెం చైర్‌పర్సన్ సీతాలక్ష్మిపై అవిశ్వాస తీర్మానం పెడుతున్న నేపథ్యంలో బీఆర్ఎస్‌కు చెందిన నాయకులు కాంగ్రెస్‌లో చేరడం రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్, తదితరులు పాల్గొన్నారు. మరోవైపు, ఎన్నో హై డ్రామాల మధ్య సూర్యాపేట మునిసిపల్ చైర్‌పర్సన్ పదవిని బీఆర్ఎస్ నిలబెట్టుకున్నప్పటికీ బీఆర్ఎస్ అసమ్మతి కౌన్సిలర్లు మాత్రం చేజారిపోతున్నారు. మునిసిపల్ చైర్‌పర్సన్ పదవిని ఆశించిన 31వ వార్డు కౌన్సిలర్ కొండపల్లి నిఖిలను, ఆమె భర్త దిలీప్‌రెడ్డిని బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేయడంతో 16 మంది అసమ్మతి కౌన్సిలర్లు బుధవారం మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

రెండు ఇళ్లలో చోరీ

● 50 వేల నగదు, వెండి వస్తువులు అపహరణ

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 14: సిరిసిల్ల పట్టణంలోని శ్రీనగర్ కాలనీలోని మార్తనపేట్ మాజీ సర్పంచ్ వంశీ ఇంట్లో రెండవ అంతస్తులో అద్దెకు ఉంటున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ సంపత్ ఇంట్లో మంగళవారం చోరీ జరిగింది. జిల్లెల్ల వ్యవసాయ కళాశాలలో పనిచేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ సంపత్ ఇంటికి తాళం వేసి శుభకార్యంలో పాల్గొనేందుకు హైదరాబాద్ వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దొంగలు తాళం పగులగొట్టి లోనికి చొరబడి ఇంట్లో ఉన్న 50 వేల నగదు, విలువైన వెండి చెంబు, రెండు పళ్లాలు, ఒక దేవుడి చిన్న విగ్రహాన్ని ఎత్తుకెళ్లారు. ఇంతటితో ఆగకుండా అదే అంతస్తులో అద్దెకు ఉంటున్న మరో ఇంటి తాళం పగులగొట్టి లోనికి చొరబడినప్పటికీ దొంగలకు ఏమీ దొరకలేదు. ఆ తర్వాత మరో ఇంట్లో చోరీకి యత్నించి విఫలమై చివరికి పక్కింటి బానోతు గోపికి చెందిన ద్విచక్ర వాహనాన్ని దొంగిలించి దానిపై ముగ్గురు దొంగలు పరారయ్యారు. అయితే అదే భవనంలోని మొదటి అంతస్తులో సిరిసిల్ల డీఎస్పీ అద్దెకు ఉంటున్నారు. అయినప్పటికీ దొంగలు ప్రవేశించడం స్థానికంగా చర్చనీయాంశమైంది. ఈ సంఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సంఘటన స్థలాన్ని పరిశీలించినట్లు టౌన్‌సీఐ రఘుపతి తెలిపారు.

జీవితంపై విరక్తి చెంది మహిళ ఆత్మహత్య

మల్యాల, ఫిబ్రవరి 14 :మల్యాల మండలం తాటిపల్లి గ్రామానికి చెందిన అమ్ముల సుజాత (56) అనే మహిళ జీవితంపై విరక్తిచెంది ఉరివేసుకొని బుధవారం ఆత్మహత్యకు పాల్పడ్డట్లు మల్యాల ఎస్సై తెలిపారు. సుజాత కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ క్రమంలో బాత్‌రూమ్‌లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిందని ఎస్సై రహీం తెలిపారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు



యుగంధర్

ఫైటింక్లయిన్‌కాలనీ, ఫిబ్రవరి 14: అల్లూరు గ్రామానికి చెందిన కొయ్యడ యుగంధర్ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు గోదావరిఖని టూటౌన్ సీఐ ప్రసాదరావు తెలిపారు. యుగంధర్ ఈ నెల 13వ తేదీ తెల్లవారు జామున అల్లూరులోని ఇంట్లో నుంచి కనిపించకుండా పోయినట్టు సీఐ తెలిపారు. కుటుంబ సభ్యులు వెతికినప్పటికీ ఆచూకీ లభించ లేదని, యుగంధర్ తండ్రి కొయ్యడ రాజమౌళి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ పేర్కొన్నారు. యుగంధర్ ఆచూకీ తెలిసిన వారు సమాచారం అందించాలని సీఐ పేర్కొన్నారు.

గంజాయి విక్రయదారుల రిమాండ్

మానకొండూర్, ఫిబ్రవరి 14 : మానకొండూర్‌లో ముగ్గురు గంజాయి విక్రయదారులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని చెరువుకట్ట బస్టాండ్ వద్ద మంగళవారం రాత్రి వాహనాల తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. మండలంలోని జగ్గయ్యపల్లి గ్రామానికి చెందిన వ్యాట అనిల్‌రెడ్డి, మానకొండూర్‌కు చెందిన షేక్ ఇస్మాయిల్, లింగాపూర్‌కు చెందిన ఏకుల భరత్ అనే ముగ్గురు మోటారు సైకిల్‌పై వెళ్తుండగా తనిఖీ చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీలో వారి వద్ద నుంచి కిలో 200 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని బుధవారం ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రాజ్‌కుమార్ తెలిపారు.

అనుమానాస్పదంగా నాటుకోళ్లు మృతి

చిగురుమామిడి, ఫిబ్రవరి 14: మండలంలోని బొమ్మనపల్లి గ్రామానికి చెందిన వీరమల్ల లత అనే మహిళా రైతుకు చెందిన 130 నాటు కోళ్ల మృత్యువాత పడ్డాయని స్థానిక ఎస్సై బండి రాజేశ్ బుధవారం తెలిపారు. అయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సదరు మహిళ తన వ్యవసాయ బావివద్ద వ్యవసాయంతో పాటు నాటు కోళ్ల ఫామ్ ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తోంది. బుధవారం ఉదయం వెళ్లి చూసే సరికి 130 నాటుకోళ్ల 13ం నాటు కోళ్ల మృతి చెందినట్లు, తనకు అనేక అనుమానాలు ఉన్నాయని బాధితురాలు లత ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంఘటన స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కాళేశ్వరం అవినీతిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు

గంభీరావుపేట, ఫిబ్రవరి 14: కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయే ప్రమాదం ఉందని తెలిసి కూడా చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని కరీంనగర్ ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ ప్రశ్నించారు. గంభీరావుపేట మండల కేంద్రంతో పాటు లింగన్నపేట, కొత్తపల్లి గ్రామాల్లో బుధవారం బండి సంజయ్ ప్రజాహిత యాత్ర కొనసాగింది. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సభలో బండి సంజయ్ మాట్లాడుతూ కేంద్ర డ్యాం సేఫ్టీ అథారిటీ బృందం అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించిందన్నారు. పనులపై నివేదిక రూపొందించి చర్యలు తీసుకోవాలని కోరిన రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా లక్ష కోట్ల ప్రజాధనాన్ని వృథా చేసిన అప్పటి సీఎం కేసీఆర్ సహా బాధ్యులైన బీఆర్ఎస్ నేతలను ఎందుకు అరెస్ట్ చేయడం లేదన్నారు. కాళేశ్వరంపై కేంద్ర, రాష్ట్ర ఇంజనీరింగ్ నిపుణుల బృందం నివేదిక ఇచ్చిందని, విజిలెన్స్ సైతం రిపోర్ట్ ఇచ్చిన తరువాత మళ్లీ అక్కడికి వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. దేశ వ్యాప్తంగా బీజేపీ గెలుపు ఖాయమని తేలడంతో ప్రజల దృష్టి మళ్లించటానికి కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కాళేశ్వరం, కృష్ణా నీటి పంపకాల పేరుతో డ్రామాలు ఆడుతున్నాయని అన్నారు. కాళేశ్వరంపై సీబీఐ విచారణ జరిపిస్తామని మాట ఎందుకు తప్పుతున్నారో ప్రజలకు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కమలం గుర్తుకు ఓటువేస్తే రాముడికి ఓటేసినట్టేనని, మన కల నెరవేర్చిన మోదీని మళ్లీ ప్రధానిని చేద్దామని బండి సంజయ్ అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేసే పరిస్థితిలో లేదన్నారు. అంతకు ముందు గంభీరావుపేట మండల కేంద్రంలోని పురాతన రామాలయంలో ఎంపీ బండి సంజయ్ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకురాలు రాణిరుద్రమ, మండల బీజేపీ అధ్యక్షుడు గంట అశోక్, జిల్లా నాయకులు కొక్కు దేవేందర్‌యాదవ్, ఎంపీటీసీ రాజేందర్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధులు దెవసాని కృష్ణ, ప్రసాద్‌రెడ్డి, పత్తి స్వామిరాజు ఉన్నారు.



గంభీరావుపేటలో ప్రజాహిత యాత్రలో మాట్లాడుతున్న బండి సంజయ్

500 కోట్ల భూదాన్ భూములు కబ్జా

గంభీరావుపేట : ఓ అపర మేధావి నాపై ఏది పడితే అది మాట్లాడుతున్నాడని నన్ను గెలికితే నేను ఇంకా ఎక్కువ గెలుకుతానంటూ ఓ బీఆర్ఎస్ నేతపై ఎంపీ బండి సంజయ్ ఘాటు విమర్శలు చేశారు. గచ్చిబౌలిలో రూ.500 కోట్ల విలువ చేసే భూదాన్ భూములు కబ్జా చేసిన విషయం తనకు తెలుసన్నారు. బోయినపల్లి మండలం నర్సింగాపూర్‌లో 20 ఎకరాల భూమి వ్యవహారం, లోటస్ పాండ్ సమీపంలో అధికారులను పిలుపించుకుని నవ్వు ఏమేమి చేస్తున్నావో అంతా తెలుసని అన్నారు. తాను ఎలాంటి అక్రమ దందాలు చేయలేదన్నారు.

ఏసీపీ, సీఐల బదిలీలు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 14: కరీంనగర్ పీటీసీలో డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న జి మహేష్‌బాబును రెండు రోజుల కిందటే రామగుండం ఏసీపీగా బదిలీ చేయగా బుధవారం ఆ పోస్టింగ్‌ను రద్దు చేసి రాజన్న సిరిసిల్ల జిల్లా స్పెషల్‌బ్రాంచి డీఎస్పీగా నియామకం చేస్తూ బుధవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. అలాగే కరీంనగర్ సీసీఎస్ ఏసీపీ వి మాధవిని రెండు రోజుల కిందట రామగుండం సీసీఆర్‌బీ ఏసీపీగా బదిలీ చేయగా తాజాగా ఆ బదిలీని రద్దు చేసి తిరిగి కరీంనగర్ సీసీఎస్ ఏసీపీగా నియామకం చేశారు. అలాగే కరీంనగర్ పీటీసీ డీఎస్పీ జి మధును సిద్దిపేట ఏసీపీగా బదిలీ చేశారు.

● జమ్మికుంట సీఐగా వి రవి నియామకమయ్యారు. జమ్మికుంట సీఐగా పనిచేసిన రమేష్‌ను ఇటీవలనే బదిలీ చేయగా అతని స్థానంలో ప్రస్తుం గోదావరిఖని ట్రాఫిక్ సీఐగా విధులు నిర్వహిస్తున్న వరగంటి రవిని బదిలీ చేస్తూ మల్టీజోన్-2 ఐజీ బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. అలాగే కరీంనగర్ సీసీఎస్ సీఐగా పనిచేస్తున్న నంద లింగమూర్తిని గోదావరిఖని-2 టౌన్ సీఐగా బదిలీ చేశారు.

మేడిగడ్డ రావడానికి ముఖం చాటేసిన కేసీఆర్



మాట్లాడుతున్న గజ్జెల కాంతం

కరీంనగర్ అర్బన్, ఫిబ్రవరి 14: మేడిగడ్డ ప్రాజెక్టుకు వచ్చేందుకు కేసీఆర్‌కు ముఖం లేకనే నల్గొండలో సభపెట్టుకున్నారని, ఆయనకు పుట్టుకతోనే అబద్ధాలు ఆడడం అలవాటు అని తెలంగాణ ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు గజ్జెలకాంతం ఆరోపించారు. బుధవారం డీసీసీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేసీఆర్ స్కాములు చేయడం కోసం స్కీములు పెట్టాడన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు 35 వేల కోట్ల రూపాయల వ్యయం అయితే, దానిని లక్ష 30 వేల కోట్ల రూపాయలకు పెంచి దోచుకుతిన్నారని ఆరోపించారు. కేసీఆర్ అసెంబ్లీకి ఎందుకు రావడం లేదో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈనెల 17 తేదీన హైదరాబాద్‌లోని సెంటర్ కోర్టులో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశామని, నిజమైన ఉద్యమకారుడు అయితే కేసీఆర్ ఈ సమావేశానికి హాజరు కావాలన్నారు. కేసీఆర్ తన కుటుంబ పాలన కోసం పార్టీ పెట్టి, తెలంగాణ ప్రజలను మభ్యపెట్టి సెంటిమెంటును వాడుకున్నాడన్నారు. తెలంగాణ కోసం కేసీఆర్ దొంగ దీక్షను నిజమని నమ్మి శ్రీకాంతచారితో పాటు వందల మంది ఆత్మహత్య చేసుకున్నారన్నారు. విలేకరుల సమావేశంలో నాయకులు సముద్రాల అజయ్, గజ్జల ఆనంద్‌రావు, కొంద్ర సంపత్ పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీల రద్దు

● పర్సన్ ఇన్‌చార్జిలుగా అధికారులు

వరంగల్‌టౌన్, ఫిబ్రవరి 14: రాష్ట్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గాలను రద్దు చేస్తూ మంగళవారం రాత్రి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో మార్కెటింగ్‌శాఖ వరంగల్ రీజియన్ పరిధిలోని 110 వ్యవసాయ మార్కెట్లకు 48 మార్కెట్ల పాలకవర్గాలు రద్దయ్యాయి. ఇక మిగిలిన పాలకవర్గాలకు గతంతో సమయం ముగిసిపోయింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 198 వ్యవసాయ మార్కెట్ కమిటీలకు కొత్త పాలకవర్గాలను నియమించేందుకు మార్గం సుగమం కాగా.. ఆ మేరకు మంత్రులు, ఎమ్మెల్యేలు సన్నాహాలు చేసుకోవాలని ఇప్పటికే ముఖ్యమంత్రి ప్రకటించిన విష యం తెలిసిందే. అలాగే పాలకవర్గాలు రద్దు కావడంతో పాలనపరమైన ఇబ్బందులు తలెత్తకుండా మార్కెటింగ్‌శాఖ అధికారులను పర్సన్ ఇన్‌చార్జులుగా నియమించారు. సెలక్షన్ గ్రేడ్ మార్కెట్ కమిటీలకు జేడీ పర్సన్ ఇన్‌చార్జ్‌గా, స్పెషల్ గ్రేడ్ మార్కెట్ కమిటీలకు డీడీ పర్సన్ ఇన్‌చార్జ్‌గా అంతకంటే దిగువస్థాయి మార్కెట్ కమిటీలకు డీఎంవోలు పర్సన్ ఇన్‌చార్జ్‌లుగా ప్రభుత్వం నియమించింది.

ఉమ్మడి జిల్లాలో రద్దయిన మార్కెట్ కమిటీలు ఇవే..

కరీంనగర్ జిల్లాలోని చొప్పదండి, గంగాధర, గోపాల్‌రావుపేట కమిటీలు, సిరిసిల్ల జిల్లాలోని పోత్గల్, గంభీరావుపేట్, రాచర్ల బొప్పాపూర్, రుద్రంగి, ఇల్లంతకుంట, బోయిన్‌పల్లి, వీర్నపల్లి మార్కెట్ కమిటీలున్నాయి. అలాగే జగిత్యాల జిల్లాలో పెగడపల్లి, వెల్గటూర్, రాయ్‌కల్, గొల్లపల్లి, ధర్మపురి, మల్యాల, కథలాపూర్,మేడిపల్లి మార్కెట్ కమిటీలు, పెద్దపల్లి జిల్లాలోని కమాన్‌పూర్, సుల్తానాబాద్, ధర్మారం, మంథని మార్కెట్ కమిటీలు రద్దయిన వాటిలో ఉన్నాయి.

కాంగ్రెస్ ఎమ్మెల్యే ఉన్న దగ్గర మార్కెట్ కమిటీలకు పాలకవర్గాలను ఏర్పాటు చేసుకునేందుకు నేరుగా ప్రతిపాదనలు పంపిస్తారు. ఇతర పార్టీ ఎమ్మెల్యేలున్న చోట జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ప్రతిపాదనలు పంపించే అవకాశం ఉంది.

ఎంబీఏ, ఎంసీఏ పరీక్షల షెడ్యూల్ విడుదల

గణేశ్‌నగర్, ఫిబ్రవరి14: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహించనున్న ఎంబీఏ, ఎంసీఏ, మొదటి సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలు ఈనెల 26 నుంచి మార్చి5 వరకు జరగనున్నట్లు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎన్‌వి శ్రీరంగప్రసాద్ తెలిపారు. పరీక్షలు మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, ఫిబ్రవరి14: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో నవంబర్ 2023న నిర్వహించిన హోటల్ మేనేజ్‌మెంట్ 1,3,5వ సెమిస్టర్ ఫలితాలను పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎన్వి శ్రీరంగప్రసాద్, విడుదల చేశారు. ఫలితాలను యూనివర్శిటీ వెబ్‌సైట్www.satavahana.ac.in,http://లోఅందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

బీఎస్సీ మొదటి సెమిస్టర్ ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, ఫిబ్రవరి14: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో జనవరి 2024 నిర్వహించిన బీఎస్‌సి(ఆనర్స్) (కంప్యూటర్ సైన్స్) ఒకటో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను బుధవారం విడుదల చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎన్వి శ్రీరంగప్రసాద్ తెలిపారు. ఫలితాలను www.satavahana.ac.inaలో అందుబాటులో ఉంచినట్లు ఆయన తెలిపారు.

నేడు జేఎల్ఎం అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

గణేశ్‌నగర్, ఫిబ్రవరి14: జూనియర్ లైన్‌మెన్ సర్టిఫికెట్ల పరిశీలన, స్తంభం ఎక్కించే పరీక్షలను టీఎస్ఎన్‌పీడీసీఎల్, కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో గురువారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహిస్తున్నట్లు ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ తెలిపారు. అభ్యర్థుల చిరునామాలకు పోస్ట్ ద్వారా కాల్‌లెటర్లు పంపించామన్నారు. అందనివారు కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో కాల్‌లెటర్ పొందవచ్చన్నారు. జేఎల్ఎం నియామక కమిటీ ద్వారా అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన, పోలు ఎక్కించడం పరీక్షలను పారదర్శకంగా నిర్వహిస్తామని ఎస్ఈ తెలిపారు.

బాలింత మృతి.. బంధువుల ఆందోళన

జమ్మికుంట, ఫిబ్రవరి 14: జమ్మికుంట పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో శిశువుకు జన్మనిచ్చిన అనంతరం ఓ బాలింత చికిత్స పొందుతూ మృత్యువాత పడింది. వైద్యుల నిర్లక్ష్యం వల్లే మృతి చెందిందని ఆరోపిస్తూ మృతదేహంతో బంధువులు ఆసుపత్రి ఎదుట బుధవారం ధర్నా, రాస్తారోకో చేపట్టారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం తొగరాయి గ్రామానికి చెందిన జుంగోని మానస (24) రెండవ కాన్పు కోసం తల్లిగారి గ్రామం అయిన వీణవంక మండలం శ్రీరాములపేటకు వచ్చింది. ఈ నెల 12న జమ్మికుంట పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి ప్రసవం కోసం భర్త శ్రీకాంత్‌తో కలిసి వెళ్లింది. మరుసటి రోజు ఆపరేషన్ చేయగా, మగ శిశువుకు జన్మినిచ్చి అపస్మారక స్థితిలోకి చేరుకుంది. కొద్ది గంటల తర్వాత ఆరోగ్యం విషమించిందని, మెరుగైన చికిత్స నిమిత్తం ఇతర ఆసుపత్రికి తీసుకు వెళ్లాలని వైద్యులు సూచించారు. దీంతో హన్మకొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకు వెళ్లగా, అక్కడి వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృత్యువాత పడింది. పోలీస్‌లు సంఘటన స్థలానికి చేరుకుని వారిని శాంతింపచేశారు. మృతురాలికి భర్త శ్రీకాంత్, రెండేళ్ల కుమారుడు, మగ శిశువు ఉన్నారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్‌లు తెలిపారు.

జిల్లా సమగ్ర స్వరూపం పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 14: నగరంలోని ఫిలింభవన్‌లో బుధవారం తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో ప్రచురించిన కరీంనగర్ జిల్లా సమగ్ర స్వరూపం గ్రంథావిష్కరణ జరిగింది. ముఖ్య అతిథిగా కలెక్టర్ పమేలా సత్పతి హాజరై గ్రంథావిష్కరణ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నిజమైన వారసత్వ చరిత్ర భావి తరాలకు అందాలంటే ఇలాంటి గ్రంథాలు రావాల్సిన అవసరం ఉందని అన్నారు. పెద్దపల్లి జిల్లా అడిషనల్ కలెక్టర్ జీవీ శ్యాంప్రసాద్‌లాల్ మాట్లాడుతూ సాహిత్యకారులు రేపటి తరానికి రూపాన్ని ఇచ్చే విధాతలని అన్నారు. పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి మాట్లాడుతూ జిల్లా ఒక సాహిత్య కురుక్షేత్రంగా పరిఢవిల్లుతుందని అన్నారు. కార్యక్రమంలో పరిషత్తు కార్యదర్శి డాక్టర్ జుర్రు చెన్నయ్య, గ్రంథ కన్వీనర్ డాక్టర్ గండ్ర లక్ష్మణరావు, గాజుల రవీందర్, కెఎస్ అనంతాచార్య, వారాల ఆనంద్, డాక్టర్ కలువకుంట రామకృష్ణ, సుదర్శనం వేణుశ్రీ, డాక్టర్ మలయశ్రీ, వాభద్రారావు తదితరులు పాల్గొన్నారు.

'పార్లమెంట్ ఎన్నికలకు బీజేపీ సిద్ధం'

భగత్‌నగర్, ఫిబ్రవరి 14: పార్లమెంట్ ఎన్నికలకు బీజేపీ శ్రేణులు సిద్ధంగా ఉన్నాయని ఆ పార్టీ పార్లమెంట్ బాధ్యులు మీసాల చంద్రయ్య, బోయినపల్లి ప్రవీణ్‌కుమార్‌లు అన్నారు. బుధవారం నగరంలో బీజేపీ పార్లమెంట్ ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరీంనగర్‌లో మరోమారు కాషాయ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో బీజేపీ కరీంనగర్, రాజన్నసిరిసిల్ల జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, ప్రతాప రామకృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుగ్గిళ్లపు రమేష్, సంజీవరెడ్డి, బాస సత్యనారాయణ, దుబాల శ్రీనివాస్, శ్రవణ్, రమణారెడ్డి, బల్వీర్‌సింగ్, శ్రీనివాస్, జానపట్ల స్వామి, సిద్ది సంపత్, కోల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

'కృష్ణా నీటి తరలింపునకు కేసీఆరే కారణం'

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 14: కృష్ణానది నీళ్లను ఆంధ్రాకు తరలింపునకు అపుడు సీఎంగా ఉన్న కేసీఆరే కారణమని ప్రజా మిత్ర ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ అన్నారు. బుధవారం నగరంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో బోయినిపల్లి చంద్రయ్య, చిగిరి శ్రీధర్, తరాళ్ల నరసయ్య, సిహెచ్ రామ్మూర్తి, గజ్జల రవీందర్ పాల్గొన్నారు.

అంబేద్కర్ యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా నవీన్

సుభాష్‌నగర్, ఫిబ్రవరి14: తెలంగాణ అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా చిలుముల నవీన్ నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు సముద్రాల అజయ్ ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన వారందరికి నవీన్ కృతజ్ఞతలు తెలిపారు.

'రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి'

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 14:రిటైర్డ్ ఫారెస్ట్ గెజిటెడ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని రిటైర్డ్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ అన్నారు. రిటైర్డ్ ఫారెస్ట్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని విద్యారణ్యపురి కాలనీలో సంఘం కార్యాలయంలో బుధవారం ఉమ్మడి జిల్లా సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలను చెల్లించాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కాంచనపల్లి మహేందర్‌రాజు, సంఘం నాయకులు పాల్గొన్నారు.

'బండి' పాదయాత్రతో వినోద్‌కుమార్ వెన్నులో వణుకు

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి14: ఎంపీ బండి సంజయ్ కుమార్ పాదయాత్రతో మాజీ ఎంపీ వినోద్‌కుమార్ వెన్నులో వణుకు మొదలైందని, ప్రజాదరణను చూసి ఓర్వలేక అసత్యపు ప్రచారాలకు తెరలేపుతున్నాడని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్లపు రమేశ్ ఒక ప్రకటనలో అన్నారు. అభివృద్ధిపై విజన్ లేని నాయకుడు వినోద్‌కుమార్ అని ఎద్దేవా చేశారు.

'పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడి పాత్ర కీలకం'

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి14: పాఠశాలల్లో ప్రధానో పాధ్యాయుడి పాత్ర అత్యంత కీలకమని, పాఠశాల, విద్యార్థుల భవిష్యత్ ఆయనపై ఆధారపడి ఉంటుందని విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు గోగులకొండ మోహన్ అన్నారు. బుధవారం నగరంలోని సుభాష్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం ఉమ్మడి జిల్లాశాఖ ఆధ్వర్యంలో ఇటీవల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతిపై వెళ్ళిన 16 మంది హెచ్‌ఎంలను సన్మానించారు.

మంత్రి పొన్నంను విమర్శించే స్థాయి కౌశిక్‌రెడ్డికి లేదు

● కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్

హుజూరాబాద్, ఫిబ్రవరి 14: అసెంబ్లీలో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను విమర్శించే స్థాయి ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డికి లేదని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అసెంబ్లీలో కేసీఆర్ దగ్గర మార్కులు కొట్టెయ్యాలని ఆయనకు సంబంధం లేని దానిలో తలదూరుస్తున్నాడని పేర్కొన్నారు. ఎమ్మెల్సీగా ఉండి హుజూరాబాద్ నియోజకవర్గానికి ఒక్క రూపాయి కూడా నిధులు తేలేదన్నారు. ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి స్వార్థ రాజకీయాల కోసం దళితబంధు రెండో విడత నిధులు ఇవ్వకుండా అడ్డుకున్నది కౌశిక్‌రెడ్డి కాదా అని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పార్లమెంట్‌లో కొట్లాడిన చరిత్ర ఉందన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కౌశిక్‌రెడ్డికి తెలంగాణ వాదులపై రాళ్లు రువ్విన చరిత్ర ఉందన్నారు. ఇది బీఆర్ఎస్ ప్రభుత్వం కాదని, ప్రజల చేత ఎన్నుకోబడిన కాంగ్రెస్ ప్రభుత్వమన్నారు.

మేడారం భక్తులు ప్లాస్టిక్‌ను వాడొద్దు

హుజూరాబాద్, ఫిబ్రవరి 14: మేడారం జాతరకు వెళ్లే భక్తులు ప్లాస్టిక్ కవర్లను వాడకుండా బట్ట సంచులను వాడాలని సామాజిక కార్యకర్త నలుబాల వేణుగోపాల్ అన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్లు, బాటిల్స్ వాడడం వలన వాతావరణం సమతుల్యత దెబ్బతింటుందన్నారు. ప్లాస్టిక్ బదులు బట్ట సంచులు, జూట్ బ్యాగ్‌లు, స్టీల్ గ్లాసులు, ప్లేట్లు వాడాలన్నారు. అడవిలో ఎక్కడపడితే అక్కడ ప్లాస్టిక్ వేయరాదన్నారు.

గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలి

చిగురుమామిడి,ఫిబ్రవరి14: గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని చిగురుమామిడి మండలంలోని పీచుపల్లి గ్రామస్థులు కోరుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తమ గ్రామానికి ఎన్నికల ప్రచారానికి వచ్చిన నేటి మంత్రి పొన్నం ప్రభాకర్‌కు గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని విన్నవించారు. ఆ నేపథ్యంలో ప్రభుత్వం ఏర్పాటయ్యాక నెల రోజుల్లో బస్సు ఏర్పాటు చేస్తామని గ్రామస్థులకు హామీ ఇచ్చారు. రాష్ట్ర మంత్రిగా ఉన్న పొన్నం ప్రభాకర్ స్పందించి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

రామడుగులో ఎయిడ్స్‌పై కళాబృందం ప్రదర్శన



రామడుగులో ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న కళాకారులు

రామడుగు, ఫిబ్రవరి 14: నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఆధ్వర్యంలో నటరాజ్ కల్చరల్ మీడియా కళాజాత బృందం వారిచే మండల కేంద్రంలో ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు తమ ఆటపాటలతో ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు గోనెల సమ్మన్న, నాగరాజ్ నాయక్, గంధం ప్రశాంత్ పాల్గొన్నారు.

'బీసీ సబ్‌ప్లాన్‌పై ప్రకటన ఏదీ?'

గణేశ్‌నగర్,ఫబ్రవరి14: మహాత్మా జ్యోతిబా ఫూలే పేరుతో బీసీ సబ్ ప్లాన్ తీసుకొస్తామన్న కాంగ్రెస్ పార్టీ తొలి బడ్జెట్‌లో దాని ఊసే తీసుకురాలేదని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ ప్రశ్నించారు. మంకమ్మతోటలోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో మాట్లాడారు. బడ్జెట్‌లో 60 శాతం ఉన్న బీసీలకు రూ. 8000 కోట్లు కేటాయించడం సరికాదన్నారు.

విద్యాసంస్థల్లో వసంతపంచమి వేడుకలు



అల్ఫోర్స్‌లో పూజలు చేస్తున్న చైర్మన్ నరేందర్‌రెడ్డి



సిద్ధార్థ పాఠశాలలో పూజలు



అచీవర్స్‌లో పూజలు చేస్తున్న విద్యార్థులు

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 14: నగరంలోని పలు విద్యాసంస్థల్లో బుధవారం వసంతపంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మానేరు విద్యాసంస్థల్లో జరిగిన కార్యక్రమంలో చైర్మన్ కడారి అనంతరెడ్డి, డైరెక్టర్ కడారి సునీతారెడ్డి పాల్గొన్నారు. మంకమ్మతోట, భగత్‌నగర్, సీతారాంపూర్ సిద్ధార్థ విద్యాసంస్థలో జరిగిన వేడుకల్లో అకాడమిక్ డైరెక్టర్ దాసరి శ్రీపాల్‌రెడ్డి పాల్గొన్నారు. పారమిత విద్యాసంస్థల్లో జరిగిన వేడుకల్లో చైర్మన్ డాక్టర్ ఇనుగంటి ప్రసాదరావు, డైరెక్టర్లు అనూకర్‌రావు, ప్రసూన, రశ్మిత, రాకేశ్, వినోద్‌రావు, వియుఎం ప్రసాద్, హనుమంతరావు పాల్గొన్నారు.

●నగరంలోని వావిలాలపల్లి అల్ఫోర్స్ ఈ-టెక్నో కళాశాలలో విద్యాసంస్థల చైర్మన్ జ్యోతి ప్రకాశనం చేసి పూజలను ప్రారంభించారు. అనంతరం సరస్వతీ హోమం నిర్వహించారు.

●భగత్‌నగర్‌లో గల రావూస్ టెక్నోస్కూల్లో జరిగిన జరిగిన కార్యక్రమంలో చైర్మన్ ప్రభాకర్‌రావు, సీఈఓ నితిన్‌రావు, ప్రిన్సిపాల్ రహమాన్ పాల్గొన్నారు.

●**గణేశ్‌నగర్:** కోతిరాంపూర్‌లోని అచీవర్స్ యాక్టివ్ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో డైరెక్టర్ వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ పల్లవి పాల్గొన్నారు.

●**హుజూరాబాద్:** పట్టణంలోని కాకతీయ జూనియర్ కళాశాలలో వసంత పంచమి సందర్భంగా సరస్వతీ దేవి పూజ నిర్వహించారు. రంగనాయకుల గుట్ట వద్ద సరస్వతీ దేవి ఆలయంలో అర్చకులు తిరుమల్, ప్రదీప్‌లు సామూహిక అక్షరాభ్యాసం చేశారు. కార్యక్రమంలో చల్మెల రాజేశ్వర్‌రెడ్డి, కవ్వ ప్రవీణ్‌రెడ్డి, జున్నుతుల ప్రకాష్‌రెడ్డి, దిలీప్‌రెడ్డి, అశోక్, సత్యనారాయణ, వేణుమాధవ్, రాజు, శ్యాంసుందర్, శ్రీధర్, అనిల్, శ్రీనివాస్, నర్సింహారావు, వెంకటరమణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

●**సైదాపూర్:** మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలలో వసంత పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

●**చొప్పదండి:** మండలంలో వసంతపంచమి వేడుకలు వైభవంగా జరిగాయి. చొప్పదండిలోని జ్ఞాన సరస్వతి ఆలయంలో వసంత పంచమి వేడుకలను నిర్వహించారు. చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించగా భక్తులు ప్రత్యేక పూజలు జరిపారు.

●**రామడుగు:** గోపాల్‌రావుపేటలోని శ్రీ ప్రగతి హైస్కూల్‌లో అక్షరాభ్యాసాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ రాధాకృష్ణ, ప్రిన్సిపాల్ వెంకటనారాయణ పాల్గొన్నారు.

●**గన్నేరువరం:** మండల కేంద్రంలోని విజ్ఞాన్ హైస్కూల్‌లో వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ బూర వెంకటేశ్వర్, ప్రిన్సిపాల్ భానుచైతన్య పాల్గొన్నారు.

యజ్ఞవరాహక్షేత్రంలో రథసప్తమి

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి14: నగరంలోని యజ్ఞవరాహ క్షేత్రంలో శుక్రవారం రథసప్తమి మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్‌విఎస్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ శ్రీభాష్యం వరప్రసాదశర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6గంటలకు సూర్య ప్రభవాహన సేవ, 12 మార్లు ఆదిత్య హృదయస్తోత్రపారాయణం, అనంతరం అరుణపారాయణం ఉంటుందని పేర్కొన్నారు. భక్తులు ఉత్సవంలో పాల్గొని తరించాలని కోరారు.

ఆటో డ్రైవర్లకు రూ.15వేలు ఇవ్వాలి

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 14: ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం వల్ల ఆటో డ్రైవర్లకు కిరాయి లేకుండా పోయిందని, వారికి నెలకు రూ.15వేల జీవనభృతి అందించాలని కరీంనగర్ ఆటో కార్మిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు మద్దెల రాజేందర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించినప్పటినుంచి ఆటో కార్మికుల కుటుంబాలు వీధిన పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పథకం ప్రారంభమైన నాటినుంచి ఇప్పటివరకు 21మంది ఆటో కార్మికులు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. మరణించిన ప్రతి ఆటో కార్మిక కుటుంబానికి ప్రభుత్వం రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా ఈనెల 16న ఆటో బంద్ కార్యక్రమాన్ని తలపెట్టినట్లు తెలిపారు సమావేశంలో ప్రధానకార్యదర్శి బండారి సంపత్, మాజీ అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాస్‌రెడ్డి, సహాయ కార్యదర్శులు కొత్తూరి సత్యనారాయణ, ఈరవేని కుమార్, అంతగిరి సంపత్, పురుషోత్తమచారి తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 14: మల్యాలకు చెందిన గడ్డం కాంతమ్మ బుధవారం మరణించగా కుటుంబసభ్యులు ఆమె నేత్రాలను దానం చేశారు. హైదరాబాద్‌లోని ఎల్‌వీ ప్రసాద్ నేత్రవైద్యశాల డాక్టర్లు ఆమె నేత్రాలను సేకరించి హైదరాబాద్‌కు తరలించారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు గడ్డం చందన కుమార్, గడ్డం మదన్, గడ్డం సజన్‌కుమార్, క్యాస రత్నమాల, లిగారెడ్డి, గంగుల గీత, వెంకన్న, గంగుల సుధాకర్, తోట ప్రభాకర్, సురేందర్, కోల అన్నారెడ్డి, ఎ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కోదండ రామాలయం చైర్మన్‌గా రాంరెడ్డి

కరీంనగర్‌రూరల్, ఫిబ్రవరి 14: నగరంలోని తీగలగుట్టపల్లి కోదండరామాలయ చైర్మన్‌గా పాకాలరాంరెడ్డి పదవీ బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో దేవస్థానం కమిటీసభ్యులు, గ్రామస్థులు, ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

'హామీలను విస్మరించిన కేంద్ర ప్రభుత్వం'



సమావేశంలో పాల్గొన్న నాయకులు

భగత్‌నగర్, ఫిబ్రవరి 14: కేంద్ర ప్రభుత్వం కార్మికులకు, రైతులకు ఇచ్చిన హామీలను విస్మరించిందని పలువురు నాయకులు విమర్శించారు. బుధ వారం నగరంలోని ముకుందలాల్ మిశ్రా భవన్‌లో జాయింట్ ప్లాట్‌ఫాం ఆఫ్ ట్రేడ్ యూనియన్స్, కిసాన్ సంయుక్త మోర్చా ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. 16న తలపెట్టిన కార్మిక, గ్రామీణ బంద్‌కు రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నేతలు రౌండ్ టేబుల్ సమావేశంలో మద్దతు ప్రకటించారు.ఈ సందర్భంగా పలు రాజకీయ పార్టీల నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతులకు మద్దతు ధర అమలు చేస్తామని, వాగ్దానం చేసి పది సంవత్సరాలు గడిచినా ఒక్క హామిని నెరవేర్చలేదన్నారు. రైతులకు ప్రమాద కరమైన చట్టాలను తీసుకు వచ్చి రైతులను భూముల నుండి దూరం చేసేవిధంగా ప్రభుత్వ చర్యలు ఉన్నాయన్నారు. సమ్మెకు కాంగ్రెస్, తెలుగుదేశం, సీపీఐ, సీపీఎం, సీపీఐఎంఎల్ ప్రజాపంథా, సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ రాజకీయపార్టీలు మద్దతు ప్రకటించాయి. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి కొయ్యడ సృజన్‌కుమార్, టిడిపి సీనియర్ నాయకుడు కళ్యాడపు ఆగయ్య సీపీఐఎంఎల్ ప్రజాపంతా జిల్లా కార్యదర్శి జిందం ప్రసాద్, ఎడ్ల రమేష్, బొమ్మడి శ్రీనివాస్‌రెడ్డి, పిట్టల శ్రీనివాస్, కవ్వంపల్లి అజయ్, వడ్లరాజు, నల్లగొండ శ్రీనివాస్, యుగేందర్, గజ్జెల శ్రీకాంత్, అంగిడి కుమార్, ఆకుల మల్లేశం, సంపత్ పాల్గొన్నారు.

సమ్మక్క జాతరకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి



గద్దెల వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 14: ఈ నెల 21 నుంచి 24 వరకు రేకుర్తిలో జరిగే సమ్మక్క సారలమ్మ జాతరకు పటిష్ఠమైన ఏర్పాట్లు చేయాలని మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. బువారం జాతర ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్పోరేషన్ పక్షాన 66 లక్షల రూపాయల టెండర్లు చేజిక్కిచ్చుకున్న వారు ఈ నెల 20వ తేదీ వరకు పనులు పూర్తిచేయాలని అన్నారు. ఎస్ఆర్ ఎస్‌పి సిఈతో మాట్లాడి 20వ తేదీ నుంచి 24వ తేదీ వరకు కెనాల్ నీటిని విడుదల చేయాలని కోరారు. భక్తుల సౌకర్యం కోసం చేస్తున్న ఏర్పాట్లను జాతర అధికారి ఎండపెల్లి మారుతిని అడిగి తెలుసుకున్నారు. అమ్మవార్ల గద్దెలను దర్శించి పూజలు జరిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మాదవి, రాజశేఖర్, జాతర చైర్మన్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలి



కేశవపట్నంలో జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

శంకరపట్నం, ఫిబ్రవరి 14: జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని లోకల్ బాడీస్ అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ అన్నారు. శంకరపట్నం మండలంలో బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా వారు కేశవపట్నం పాత గ్రామపంచాయతీ భవనాన్ని శుభ్రం చేసి గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థులు చదువుకునేందుకు అన్ని వసతులు ఏర్పాటు చేయాలని తెలిపారు. కేశవపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ చేశారు. రిజిస్టర్ పరిశీలించారు. వైద్య సిబ్బందితో మాట్లాడి వారికి పలు సూచనలు చేశారు. అనంతరం కేశవపట్నంలో నిర్వహించే సమ్మక్క జాతర ఏర్పాట్ల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతరకు వచ్చే భక్తులకు అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీవాణి, తహసీల్దార్ అనుపమ, ఎంపీవో బషీరుద్దీన్, పంచాయతీ కార్యదర్శి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

సమ్మక్క-సారలమ్మ జాతర గోడ పత్రిక ఆవిష్కరణ

వీణవంక: మండల కేంద్రంలో నిర్వహించే సమ్మక్క సారలమ్మ జాతర గోడ పత్రికలను స్థానిక నాయకులు ఆవిష్కరించారు. వీణవంకలో జాతరను పాడి రామకృష్ణారెడ్డి, పాడి ఉదయనందన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా జాతర పనులు ప్రారంభించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చింతల శ్యాసుందర్‌రెడ్డి, మాజీ సర్పంచుల ఫోరమ్ అధ్యక్షుడు ఎక్కటి రఘుపాల్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ దాసారపు ప్రభాకర్, గంగాడి రాజిరెడ్డి, అమృత ప్రభాకర్, ఐలయ్య, మాదాసి సునీల్, నారాయణ, అమీద్‌తదితరులు పాల్గొన్నారు.

● సైదాపూర్: సైదాపూర్-జాగీర్‌పల్లి గ్రామాల మధ్య గుట్టపై జరిగే సమ్మక్క-సారక్క జాతర గోడ పోస్టర్‌ను జాతర కమిటీ సభ్యులు బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కామిని వీరేశం, సమ్మయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవోలు

హుజూరాబాద్, ఫిబ్రవరి 14: హుజూరాబాద్ ఎంపీడీవోగా సునీత బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన జయశ్రీని జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు బదిలీ చేశారు. ఈ మేరకు సునీత బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పంచాయతీ సిబ్బంది ఎంపీడీవో సునీతకు పుష్పగుచ్ఛం అందజేశారు.

● ఇల్లందకుంట: ఇల్లందకుంట ఎంపీడీవోగా జిల్లెపల్లి పుల్లయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పని చేసిన శంకర్ కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలానికి బదిలీపై వెళ్లగా, జగిత్యాల జిల్లా పెగడపల్లి మండల ఎంపీడీవోగా పనిచేస్తున్న పుల్లయ్యను ఇక్కడికి బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని, అభివృద్ధికి స్థానిక ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. అనంతరం నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవోను పలువురు ప్రజాప్రతినిధులు సన్మానించారు.

● తిమ్మాపూర్: ఎంపిడివోగా బాధ్యతలు స్వీకరించిన విజయ్ కుమార్‌ను బుధవారం పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎంపిడివోగా బాధ్యతలు స్వీకరించిన విజయ్‌కుమార్ తిమ్మాపూర్ గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. ఎంపిడివోను కలిసి శుభాకాంక్షలు తెలిపిన వారిలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పోలు రాము, ఎంపివో కిరణ్, పంచాయతీ కార్యదర్శి మహేందర్ రావు, నాయకులు పోలు రమేష్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ కార్యవర్గం ఏర్పాటు

చొప్పదండి, ఫిబ్రవరి 14: మండలంలోని కోనేరుపల్లి గ్రామ మహిళా కమిటీని ఎమ్మార్పీఎస్ ఏర్పాటు చేసింది. అధ్యక్షురాలిగా కోలపురి హరిత, ఉపాధ్యక్షు రాలిగా గజ్జెల మంగ, ప్రధాన కార్యదర్శి మల్యాల శారద, రామడుగు సంధ్య, గజ్జెల రాధ, కోలపురి తులిసమ్మలకు కార్యవర్గాన్ని జిల్లా మహిళా ప్రధానకార్యదర్శి తాటి చామంతి ప్రకటించారు.

ముగిసిన శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



హుజూరాబాద్‌లో పూర్ణాహుతి కార్యక్రమం

హుజూరాబాద్, ఫిబ్రవరి 14: హుజూరాబాద్ పట్టణ శివారు కేసీ క్యాంపులోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో 42వ బ్రహ్మోత్సవాలు మంగళవారం రాత్రి ముగిశాయి. ఈ సందర్భంగా ప్రాబోధకి, పూర్ణాహుతి, స్నపనము చక్రవరి, శ్రీపుష్ప యాగం ద్వాదశారాధన, ఆశీర్వాదం ఆచార్య రుత్విక్కులకు బహుమానములు తదితర కార్యక్రమాలు ఆలయ అర్చకులు నందకిశోరాచార్యులు, నిఖిలాచార్యులులు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా స్వామివారి బ్రహ్మోత్స వాలు జరిగాయని నిర్వాహకులు సురేందర్, సత్తయ్యగౌడ్, గణపతిరెడ్డిలు తెలిపారు.

మామిడాలపల్లిలో..

వీణవంక: మండలంలోని మామిడాలపల్లి గ్రామంలో వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా ముగిసాయి. తొమ్మిది రోజుల పాటు నమిలి కొండ రమణాచార్యులు ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమములో ఆలయ చైర్మన్ దాచేపల్లి సత్యనారాయణ, ఆలయ అర్చకులు, భక్తులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

దేవంపల్లి గురుకులంలో పాటించని మెనూ

మానకొండూర్, ఫిబ్రవరి 13: మండలంలోని దేవంపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో మెనూ పాటించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. పాఠశాలలో 5వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు మొత్తం విద్యార్థులు 593 మంది విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ పర్యవేక్షణ లేకుండా పోవడంతో గుత్తేదారు వండిందే తింటూ విద్యార్థులు కాలం వెల్లదీస్తున్నారు. అంతేకాకుండా మంగళవారం కోడి గుడ్డు అందజేయాల్సి ఉండగా ఇవ్వలేదని విద్యార్థులు తెలిపారు. ఐదు నెలల నుంచి బిల్లులు రాకపోవడంతో మెనూను పాటించడం లేదని నిర్వాహకులు తెలిపారు. ఈ విషయంపై ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డిని వివరణ కోరగా బిల్లులు సక్రమంగా రాకపోవడంతోనే మెనూ విషయంలో ఇబ్బందికర పరిస్థితి ఎదుర్కొంటున్నామన్నారు.

కొత్తపల్లి ఎంపీడీవోగా ప్రభు

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 14: కొత్తపల్లి ఎంపీడీవోగా కె.ప్రభు బుధవారం బాధ్యతలు చేపట్టారు. పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎంపీవో డి శ్రీనివాస్ ఎపిఓ స్పందన, పిఆర్ ఏఈ రమణారెడ్డి, ఏపీఎం రగుపతయ్య పాల్గొన్నారు.

సందర్శకుల పట్ల అసభ్యకర ప్రవర్తనపై కేసు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 14: కరీంనగర్ డీర్‌పార్క్‌కు వచ్చిన యువతీ యువకుల వద్దకు వెళ్ళి ప్రేమికుల దినోత్సవం జరుపుకోరాదంటూ వీహెచ్‌పీకి చెందిన కొందరు కార్యకర్తలు అసభ్యకరంగా ప్రవర్తిస్తూ ఫొటో, వీడియోలు తీశారని డీర్‌పార్క్‌లో పనిచేస్తున్న ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ తేర విక్కీ మార్టిన్ బుధవారం ఒకటో రాణా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వీహెచ్‌పీకి చెందిన విద్యాసాగర్, గుజ్జేటి రాజేందర్, పానుగంటి సాయి, నందగిరి మాధవ్, ధీరజ్, త్రిపర్తి వికాస్, మచ్చ దినేష్, రామంచ సాయికుమార్, గులపల్లి మల్లిఖార్జున్, త్రివేణి, శశికుమార్, వడెపల్లి సుమన్, అఖిల్‌పై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

సమ్మెకు వామపక్ష విద్యార్థి సంఘాల మద్దతు

భగత్‌నగర్, ఫిబ్రవరి 14: దేశ వ్యాప్తంగా ఈనెల16న తలపెట్టిన సార్వత్రిక సమ్మెకు వామపక్ష విద్యార్థి సంఘాలు మద్ధతు ప్రకటించారు. బుధవారం నగరంలోని బద్దంఎల్లారెడ్డి భవన్‌లో వామపక్ష విద్యార్థి సంఘాల సమావేశం ఏఐఎస్‌ఎఫ్ నగర కార్యదర్శి మామిడిపల్లి హేమంత్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కార్మిక, విద్యార్థి, యువజన రైతు మహిళా వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందన్నారు.

ఈకార్యక్రమంలో నాయకులు మచ్చ రమేష్, గజ్జెల శ్రీకాంత్, కూతాడి రానాప్రతాప్, అంగడి కుమార్, కసిరెడ్డి శ్రీకాంత్, సందీప్, పవన్ పాల్గొన్నారు.

కంకర రోడ్డు ఫిర్యాదుపై విచారణ

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 14: బొమ్మకల్ గ్రామ పరిధిలోని రజ్వీచమన్ రోడ్ నెం.1లో కంకర తేలిన రోడ్డుపై ప్రజావాణిలో ఫిర్యాదు మేరకు బుధవారం ఎంపివో జగన్మోహన్‌రెడ్డి విచారణ చేపట్టారు. కార్యక్రమంలో సయ్యద్ ముజాఫర్, అంజద్‌అలీ, అఫ్జల్, సంతోష్, బదురు ద్దీన్, షాహిద్, యూనుస్, జాకీర్, అలీముద్దీన్, రజ్వీచమన్, సిటిజన్ కాలనీ వాసులు, గ్రామ కార్యదర్శి పాల్గొన్నారు.

దుర్శేడ్‌లో డీఎల్‌పీవో పర్యటన

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి14: కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్ గ్రామంలో డిఎల్‌పిఓ రాంబాబు పర్యటించారు. గ్రామ పంచాయతీ రికార్డులు పరిశీలించి గ్రామంలోని శానిటేషన్‌ను పరిశీలించారు. ఈకార్యక్రమంలో ఎంపిఓ జగన్మోహన్‌రెడ్డి, స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి సంజీవరెడ్డి పాల్గొన్నారు.

బైక్ ర్యాలీ పోస్టర్ల ఆవిష్కరణ

కరీంనగర్‌రూరల్, ఫిబ్రవరి 14: శివాజీ జయంతిని పురస్కరించుకుని ఈనెల 19న కొత్తపల్లి మండలంలో నిర్వహించనున్న బైక్‌ర్యాలీ పోస్టర్లను కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ సిరిసిల్లలోని నామాపూర్‌లో బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీజేపీ కొత్తపల్లి మండల శాఖ అధ్యక్షుడు కడార్ల రతన్‌కుమార్, మండల ప్రధాన కార్యదర్శులు అనిల్‌కుమార్, కోమటిరెడ్డి అంజనీకుమార్, జవ్వాజి రమేష్, దాసరి రవి, యువ ప్రశాంత్, వంశి, ఆనంద్, పోర్తి అనిల్, మల్లేశం, నరేష్, రాజు, ప్రశాత్ పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణ పనులకు భూమి పూజ

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 14: నగరంలోని జెడ్‌పి క్వార్టర్స్ ఆవరణలోని అయ్యప్ప దేవాలయ పునర్నిర్మాణ పనులకు బుధవారం పురాణం మహేశ్వరశర్మ చేతుల మీదుగా భూమిపూజ చేశారు. జడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, మేయర్ యాదగిరి సునీల్‌రావు పూజల్లో పాల్గొన్నారు. త్వరలో నిర్మాణ పనులు ప్రారంభమౌతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ఈసరి జనార్దన్, గురుస్వాములు కావేటి పరమేశ్వర్, గుండ రాధాకిషన్, దాడి సంపత్, గజవాడ ఆంజనేయులు, రాచకొండ చక్రధర్, అనిల్, సత్యనారాయణ, గడప నాగరాజు, సాయన్న, లింగంపల్లి సత్యం, బొల్లు నరేందర్, వరాల జ్యోతి నరేందర్, రమేశ్, ఈఓ కొన్న కాంతారెడ్డి, సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

పంటలకు సాగునీరు అందించాలి

సైదాపూర్, ఫిబ్రవరి 14: మండలంలో యాసంగి సీజన్‌లో వేసిన పంటలు ఎండిపోతున్నాయని చివరి ఆయకట్టు వరకు నీళ్ల అందేలా చూడాలని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయంపై మిడ్ మానేరు నీటి పారుదల శాఖ అధికారులకు ఫోన్ చేసి మాట్లాడినట్లు తెలిపారు.

మహిళ అదృశ్యం



బాలిక రౌత్(ఫైల్)

రామడుగు, ఫిబ్రవరి 14: ఉపాధి కోసం వచ్చిన ఓ మహిళ అదృశ్యమైన సంఘటన రామడుగు మండలం వెలిశాల గ్రామములో చోటు చేసుకుంది.. పోలీసుల కథనం ప్రకారం.. ఒరిస్సా రాష్ట్రానికి చెందిన మురళి రౌత్, తన భార్య బాలిక రౌత్ (40)తో కలిసి ఇటుక బట్టీలో పనిచేయుటకు కొంతకాలం క్రితం ఇక్కడికి వచ్చారు. గ్రామంలోని హరిహర ఇటుక బట్టీలో పనిచేస్తున్న బాలిక రౌత్ ఈనెల 12న బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో తన భర్త మురళి రౌత్ చుట్టు పక్కల గ్రామాల్లో వెతికినప్ప టికీ ఫలితం లేదు. ఈమె గ్రామం ఒరిస్సాలోని రికిమాల తాలూకా దొమ్మేరు. తన భార్య అదృశ్యమైందని భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

థాయిలాండ్‌లో భారత రాయబారిని కలిసిన కొత్తిరెడ్డి మల్లారెడ్డి

గణేశ్‌నగర్,ఫిబ్రవరి14: ఎస్ఆర్ఆర్ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డా. కొత్తిరెడ్డి మల్లారెడ్డి బ్యాంకాక్‌లోని చూలాలాంగ్ కార్న్ విశ్వవిద్యాలయం సందర్శించారు. అక్కడి సౌత్ ఈస్ట్ ఏషియన్ స్టడీస్ సెంటర్ నిర్వహించిన అకాడమిక్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమానికి థాయిలాండ్‌లోని భారత రాయబారి పౌలోమి త్రిపాఠి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత, థాయిలాండ్ దేశాల మధ్య సాంస్కృతిక సారూప్యతలెన్నో ఉన్నాయని అన్నారు. భారతదేశం, థాయిలాండ్‌లలో జరిగే హోలి, సంక్రాంతి లాంటి పండుగలు, పెళ్లి జరిపించే సంప్రదాయాలలో ఒకే మూలాలు ఉన్నాయన్నారు. రెండు దేశాల పురాణాల్లో ఉన్న రామాయణం, ఇతర దేవతల సారూప్యం గురించి వివరించారు. ఎస్.ఆర్.ఆర్. కళాశాల తెలుగు విభాగం అధిపతి డా. కొత్తిరెడ్డి మల్లారెడ్డి అక్కడి కోర్సులు, కరికులం, అడ్మిషన్ విధానం, పరీక్ష విధానం, మొదలైన అంశాల గురించి వివరాలు సేకరించారు.

దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

భగత్‌నగర్, ఫిబ్రవరి 14: ఈ నెల 16ననిర్వహించ తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్‌బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ పిలుపునిచ్చారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్, మతతత్వ విధానాలకు వ్యతిరేకం గా నిర్వహించే కార్మిక, రైతు ప్రజా అనుకూల విధానా లను ఎండగట్టాలన్నారు. దేశవ్యాప్త బంద్‌లో కార్మికులు , ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.